సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 16 । అక్టోబర్ । 2024



'మద్దతు' పెంచాల్సిందే..!
ఈ ఏడాది పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని. ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.10వేలకు పెంచాలని రైతులు కోరుతున్నారు. 10లో



అప్రమత్తంగా ఉండాలి
జూలూరుపాడు–తల్లాడ అటవీ రేంజ్‌లో చిరుత సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
33° / 24°
జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని చోట్ల జల్లులు పడొచ్చు. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిచారు. అదేవిధంగా మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి ఉపాలయంలో ఆంజనేయస్వామికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.

పర్ణశాలలో శని, ఆదివారాల్లో అన్నదానం

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శని, ఆదివారాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి మంగళవారం తెలిపారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయంగా ఉన్న పర్ణశాలకు వారాంతంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోందని, ఈ నేపథ్యంలో ఆలయంలో అన్నదానం చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈఓ ప్రకటనపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏ సమస్య ఉన్నా చెప్పండి

కొత్తగూడెంఅర్బన్: పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది చిన్న చిన్న కారణాలు, సమస్యలతో మానసిక ఒత్తిడికి గురికావద్దని, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు. మంగళవారం ఆయన పోలీస్ అధికారులు, సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల జరిగిన ఘటనలు తనను ఎంతో బాధ పెట్టాయని, క్షణికావేశానికి లోనై కుటుంబాల గురించి కూడా ఆలోచించకుండా ప్రాణాలు తీసుకోవడం బాధాకరమని అన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే వారంతా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తులు, వరదలు, మావోయిస్టు కార్యకలాపాల కట్టడి, గంజాయి అక్రమ రవాణా వంటి విధుల్లో జిల్లా పోలీసులకు మంచి పేరుందని గుర్తు చేశారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ, మంచి నడవడికతో ప్రజలకు సేవలు అందిస్తూ బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. అనంతరం కొందరి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ.. పరిష్కారానికి సత్వరమే కృషి చేస్తామని భరోసా కల్పించారు.

సనాతన ధర్మం కోసం స్కూటీ యాత్ర..



స్కూటీపై యాత్ర చేస్తున్న వెంకటరెడ్డి

భద్రాచలం టౌన్ : భారతదేశ సనాతన ధర్మాన్ని కాపాడాలని, భగవద్గీతతో పాటు సంస్కృత భాషపై ప్రచారం చేయాలని 76 ఏళ్ల వయసులో స్కూటర్‌పై దేశమంతా తిరిగే యాత్ర చేపట్టారు హైదరాబాద్‌కు చెందిన నారాయణం వెంకటరెడ్డి. ఈనెల 13న ఆయన యాత్రను హైదరాబాద్‌లో ఎంపీ రఘునందన్ రావు ప్రారంభించారు. స్కూటీ పై రోజుకి 200 కిలోమీటర్ల చొప్పున 500 రోజుల్లో లక్ష కిలోమీటర్లు తిరగాలని సంకల్పం పెట్టుకున్నట్లు వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి భద్రాచలం చేరుకున్న ఆయన మంగళవారం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వస్థలమైన విజయనగరం వెళ్లారు. అక్కడి నుంచి విశాఖపట్నం, తిరుమల, తిరుపతి ద్వారా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్ తదితర రాష్ట్రాలు తిరుగుతూ ప్రముఖ ఆలయాలను దర్శించుకుంటానని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆన్‌లైన్ ద్వారా 500 మంది విద్యార్థులకు సంస్కృతం నేర్పుతున్నానని చెప్పారు.

ఖద్దరు నేతకు క్షమాపణ ?

ఇటీవల పాల్వంచ పోలీస్ స్టేషన్‌కు ఓ కేసు విషయంలో మధ్యవర్తిగా వ్యవహరించేందుకు ఓ నేత వచ్చాడు. తాను చెప్పినట్టుగానే విషయాన్ని సెటిల్ చేయాలంటూ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలో మాటామాటా పెరిగింది. ప్రజాప్రతినిధులతో రాసుకు పూసుకు తిరుగుతున్న సదరు నేత స్టేషన్ సిబ్బందిని ఉద్దేశించి పరుష పదజాలం ఉపయోగించాడు. దీంతో అక్కడున్న పోలీసులు అతనిపై చేయి చేసుకున్నారు. ఫలితంగా వివాదం ముదరగా.. మరో రాజకీయ నేత స్టేషన్‌కు చేరుకున్నాడు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నడుస్తున్నప్పుడు తన అనుచరుడిపై చేయి చేసుకోవడం ఏంటంటూ సదరు నేత స్టేషన్ సిబ్బందిపై ఫైర్ అయ్యారు. చివరకు ఆ ఖద్దరు నేతకు యూనిఫామ్‌లో ఉన్న పోలీసు అధికారి సారీ చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది.



ఖాకీలపై ఖద్దరు జోక్యం !

'కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం' అన్నట్టుగా తయారైంది జిల్లాలో కొందరు పోలీసుల పరిస్థితి. సెటిల్‌మెంట్ పేరుతో రాజకీయ నేతలు, వారి అనుచరులు చేస్తున్న అతి చర్యలకు అడ్డుకట్ట వేస్తే ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి వస్తోంది. సరేలే అని సహకరిస్తే వాటి ప్రతికూల ప్రభావం పోలీసు ఖాతాల్లో చేరిపోతోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పోలీసులకు చేటు తెస్తున్న స్టేషన్ సెటిల్‌మెంట్లు
- ఈ వ్యవహారంలో తలదూరుస్తున్న నేతల అనుచరులు
- పోలీస్ ఖాతాల్లోకి ప్రతికూల ప్రభావం

అనవసర జోక్యం
ఇల్లెందు సబ్ డివిజన్‌లో ఇటీవల ఓ వ్యాపారి మృతిచెందాడు. దీంతో అతడికి అప్పులు ఇచ్చినవాళ్లు, అతడికి ఇవ్వాల్సిన వాళ్లతో ఆ కుటుంబానికి సమస్య వచ్చింది. సదరు వ్యాపారి మరణానికి ముందు రాసుకున్న పద్దుల పుస్తకం ఆధారంగా సెటిల్‌మెంట్‌కు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. అయితే సదరు వ్యాపారి గతంలో నిర్మించుకున్న కొత్త ఇంటిపై కన్నేసిన ఓ రాజకీయ నేత, అతడి అనుచరులు 'పద్దుల పుస్తకంతో సంబంధం లేదు. మేం తీసుకొచ్చిన కాగితంలోని విషయమే కరెక్ట్' అంటూ సెటిల్‌మెంట్‌కు సదరు వ్యాపారి కుటుంబంపై ఖాకీల ద్వారా ఒత్తిడి తేవడానికి ప్రయత్నించారు. కోర్టులో విషయం తేల్చుకుందామంటే కుదరదంటూ ఆ కుటుంబాన్ని ఇబ్బందుల పాలు చేశారు. ఈ విషయంలో ఖద్దరు నేతలు బాగానే ఉన్నా, మరణించిన వ్యాపారి కుటుంబంపై కనీస కనికరం లేకుండా ఇబ్బంది పెట్టారనే చెడు పేరు ఖాకీల ఖాతాలో పడింది.

గంజాయి వ్యవహారంలో గప్‌చుప్..
బూర్గంపాడు గంజాయి రాకెట్ విషయంలోనూ గత ప్రభుత్వ హయాంలో మండలంలో పేరున్న ఓ నేత పేరు ప్రముఖంగా వినపిస్తోంది. కానిస్టేబుల్ సాగర్ ఆత్మహత్యతో మరో ఇద్దరు, ముగ్గురు పోలీసు అధికారుల పేర్లు బయటకు రావడంతో ఆ శాఖకు ఇబ్బందికర పరిస్థితి ఎదురు కాగా సదరు నేత మాత్రం ఈ వివాదంతో తనకేమీ సంబంధం లేదన్నట్టుగా గప్‌చుప్ అయ్యాడు.

పెరుగుతున్న ఫ్లెక్సీల సంస్కృతి..
ఖద్దరు నేతలకు తాము దగ్గర అనే అభిప్రాయం కలిగిస్తే ఇటు ప్రభుత్వ కార్యాలయాలు, అటు పోలీస్ స్టేషన్లలో పనులు చక్కబెట్టుకోవచ్చనే అభిప్రాయంతో కొందరు నేర ప్రవృత్తి కలిగిన చోటా మోటా నాయకులు ఉన్నారు. దీంతో పండగలు, పుట్టిన రోజులు, పర్యటనలను పురస్కరించుకుని ప్రధాన రహదారుల వెంట, కూడళ్లలో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. పల్లె, పట్నం తేడా లేకుండా అన్ని చోట్లా ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఈ సంస్కృతి మరింతగా పెరుగుతోంది.

కట్టడి చేయలేరా ?
ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను తొలగించడంపై ఇటు మున్సిపల్, అటు పంచాయతీ సిబ్బంది చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫ్లెక్సీలతో మొదలవుతున్న సదరు చోటా గ్యాంగుల పెత్తనం.. ఆ తర్వాత ప్రభుత్వ కార్యాలయాల వరకు చేరుతోంది. నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులు తమ ఫొటోలను ఇష్టారీతిగా ఉపయోగిస్తే అడ్డుకోవాల్సిన నైతిక బాధ్యత రాజకీయ నేతలపై ఉంది. కానీ వారు కూడా అందుకు విరుద్ధంగా ఈ సంస్కృతిని ప్రోత్సహిస్తుండడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది. తీవ్రవాద ప్రభావిత జిల్లాగా భద్రాద్రికి గుర్తింపు ఉంది. పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి మావోయిస్టుల రాకను కట్టడి చేయడంలో పోలీసులు గణనీయంగా విజయం సాధిస్తున్నారు. ఈ సమయంలో ఖాకీలపై ఖద్దరు నేతలు అనవసర ఒత్తిడి తేవడం మంచిది కాదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

పేదలు గర్వించేలా పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పక్కన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

- ఇది దొరల ప్రభుత్వం కాదు.. ప్రజాప్రభుత్వం
- అధికారులు నెలలో రెండుసార్లు గ్రామాల్లో పర్యటించాలి
- సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి

మణుగూరు టౌన్/బూర్గంపాడు : ప్రభుత్వానికి అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు కళ్లలాంటి వారని, అందరూ బాధ్యతగా పని చేసి పేదల అభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బూర్గంపాడు మండలం తాళ్లగొమ్మూరులో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు. అనంతరం మణుగూరు ఆశ్రమ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పీ.వీ.కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో, విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.13,500 కోట్లు రెండు దఫాలుగా రుణమాఫీ చేసిందని, తమ ప్రజాపాలనలో 26 రోజుల్లోనే రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని చెప్పారు. రూ.2 లక్షల మేర రుణమాఫీకి మరో రూ.13 వేల కోట్లు కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసి ఇందిరమ్మ ఇళ్లుగా పేదలకు అందిస్తామని చెప్పారు. ఇటీవలి వరదలతో నీట మునిగిన పంటలకు ఎకరాకు రూ.10వేలు, ఇళ్లకు రూ.16,500 చొప్పున నష్టపరిహారం అందించామని తెలిపారు. ఇంకా కొందరికి రావాల్సి ఉందని, త్వరలోనే మంజూరు చేస్తామని అన్నారు. కిన్నెరసాని, గోదావరి వరదల సమయంలో ప్రజలను కాపాడేందుకు దాదాపు 15 రోజులు ప్రత్యేక శ్రద్ధ చూపిన కలెక్టర్, ఎస్పీలతో పాటు పోలీస్, అన్ని శాఖల సిబ్బందిని అభినందించారు.

దొరల ప్రభుత్వం కాదు..
తమది దొరల ఘడీల పాలన కాదని, ప్రజల ప్రభుత్వమని పొంగులేటి స్పష్టం చేశారు. కొందరు అధికారులు గతంలో వలె నిర్లక్ష్యంగా పనిచేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారు పనితీరు మార్చుకోవాలని సూచించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు వారంలో రెండు సార్లు మండలంలోని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, ఐటీసీ పీఎస్‌పీడీ (హెచ్‌ఆర్ హెడ్) శ్యామ్‌కిరణ్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



బూర్గంపాడు మండలం తాళ్లగొమ్మూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పొంగులేటి

భారీ బైక్ ర్యాలీతో స్వాగతం...
మణుగూరులోని హనుమాన్ ఆలయం వద్ద ఎమ్మెల్యే పాయం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి అంబేద్కర్ సెంటర్ ఆశ్రమ పాఠశాల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, నాయకులు కాటబోయిన నాగేశ్వరరావు, పోలెబోయిన శ్రీవాణి, పీరినాకి నవీన్, శివసైదులు, సామా శ్రీనివాసరెడ్డి, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, తాళ్లగొమ్మూరులో పోడుభూములకు పట్టాలిప్పించాలని సీపీఐ నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

క్రీడా తెలంగాణగా మార్చడమే లక్ష్యం

- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి
- జిల్లాకు చేరిన సీఎం కప్ క్రీడాజ్యోతి
- ఘన స్వాగతం పలికిన అధికారులు, ప్రజాప్రతినిధులు



టార్చ్ రిలే ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ పాటిల్ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు, యువత దృష్టిని క్రీడల వైపు మళ్లించి క్రీడా తెలంగాణగా తీర్చిదిద్దడమే సీఎం కప్ ఉద్దేశమని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి అన్నారు. సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ మంగళవారం జిల్లాకు చేరగా.. కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తదితరులు కొత్తగూడెంలోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ పార్కు వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి టార్చ్ రిలే ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా శివసేనా రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇండోర్ స్టేడియం పనులన్నీ పూర్తి చేస్తామని, జిల్లాలో స్పోర్ట్స్ అథారిటీకి అనువైన స్థలాన్ని గుర్తిస్తే అన్ని సౌకర్యాలతో క్రీడా మైదానం ఏర్పాటుకు సహకరిస్తామని తెలిపారు. సీఎం కప్ క్రీడా పోటీల ద్వారా ఎంతో మంది 'మట్టిలో మాణిక్యాలు' వెలుగులోకి వస్తారని అన్నారు. వారందరికీ అకాడమీలో శిక్షణ ఇచ్చి రాబోయే రోజుల్లో ఒలింపిక్స్‌లో పతకాలు సాధించాలనేదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిక అని వివరించారు. కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ అద్భుత అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తాయని చెప్పారు. జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారు కావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప ఆలోచనలతో క్రీడా తెలంగాణగా మార్చేందుకు, యువతను క్రీడా రంగం వైపు మళ్లించేందుకే సీఎం కప్ రూపొందించారని చెప్పారు. భద్రాద్రి అంటేనే క్రీడాకారుల జిల్లా అని, దేశంలో అత్యధికంగా క్రీడాకారులు ఈ ప్రాంతం నుంచే ఉన్నారని తెలిపారు. జిల్లాను క్రీడా రంగంలో ముందుకు తీసుకెళ్లే బాధ్యత ఒక క్రీడా ఉపాధ్యాయుడిగా తనపైనా ఉందన్నారు. ర్యాలీలో డీఎస్పీ రెహమాన్, డీవైఎస్ఓ పరంధామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన అభివృద్ధికి చేయూత ఇవ్వాలి

దాతలను సత్కరించిన భద్రాద్రి రామాలయ ఈఓ రమాదేవి



దాతలను సత్కరిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి దాతలు మరింత చేయూతనివ్వాలని ఈఓ ఎల్.రమాదేవి కోరారు. ఆలయానికి విరాళాలు సమర్పించిన దాతలను దేవస్థానం ఆధ్వర్యాన మంగళవారం సత్కరించారు. దాతలకు స్వామి వారి చిత్రపటం, కండువా, జాకెట్, ప్రసాదాలతో కూడిన కిట్ అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. రామయ్యకు విరాళాలు సమర్పించే వారు స్వామి సేవలో తరించినట్లేనని తెలిపారు. దాతల ప్రోత్సాహం లేనిదే అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్న ఆమె.. ధన, వస్తు, ఆభరణ, భూమి రూపాల్లో విరాళాలు ఇస్తున్న వారిని సత్కరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే దాతల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి సమాచారం ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు దాతలు విరాళాలను ప్రకటించారు. కార్యక్రమంలో ఈఈ రవీందర్, ప్రధాన అర్చకులు విజయరాఘవన్, స్థానాచార్యులు స్థలశాయి, అర్చకులు, వేద పండితులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్
భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారిని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో పూజలు చేసిన ఆయనకు లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

జేకేఓసీ విస్తరణకు అనుమతి

వివరాలు వెల్లడించిన ఇల్లెందు ఏరియా జీఎం

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియా జేకే–5 ఓసీ, 21 ఇంక్లయిన్ కలుపు తూ నూతనంగా ఏర్పాటు చేయబోయే నూతన జేకేఓసీ గని ఏర్పాటుకు అటవీశాఖ అను మతి లభించింది. మంగళవారం ఏరియా జీఎం జాన్‌ఆనంద్ వివరాలు వెల్లడించారు. నూతన జేకేఓసీ బొగ్గు గని ఏర్పాటుకు 151.85హెక్టార్ల అటవీభూమి వాడు కోవటానికి సూత్రప్రాయంగా అనుమతిస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు శా ఖ నుంచి సోమవారం రాత్రి అనుమతులు జారీ అయ్యాయని తెలిపారు. ఈ నూతన ఓసీ ఏర్పాటైతే ఉద్యోగుల స్థానచలనం లేకుండా ఇల్లెందు ఏరియాలోనే పనిచేసే అవకాశం లభిస్తుందన్నా రు. ఈ గని కాలపరిమితి 12ఏళ్లకు పైబడి ఉండ బోతుందని చెప్పారు. జేకే ఓసీ విస్తరణకు అను మతి లభించటంపై ఐఎన్‌టీయూసీ నేత వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నేత నజీర్ అహ్మద్, బీఎంఎస్ నేత నాయిని సైదులు హర్షం వ్యక్తంచేశారు. కాగా, జేకే ఓసీ విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం 2023 ఏప్రిల్ 26న ఇల్లెందులోని 24ఏరియా రన్స్, గోల్స్ స్టేడియంలో నిర్వహించారు. రూ.297.88 కోట్లతో 1114.507 హెక్టార్ల భూమిలో 2.50 మిలియన్ టన్నుల బొగ్గు సేకర ణ లక్ష్యంగా నిర్మించనున్నారు.

ఎట్టకేలకు కౌన్సెలింగ్

- ఆగి.. సాగిన నూతన ఉపాధ్యాయుల పోస్టింగ్ ప్రక్రియ
- వాయిదాకు పలు కారణాలు చెప్పిన విద్యాశాఖ అధికారులు
- పాఠశాలల కేటాయింపుతో అభ్యర్థుల్లో హర్షాతిరేకాలు



కౌన్సెలింగ్‌కు హాజరైన నూతన ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ – 2024లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు పాతకొత్తగూడెంలోని తెలంగాణ ఇంగ్లిష్ మీడియం స్కూల్(ఆనందఖని)లో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియలో మొదట గందరగోళం నెలకొనడంతో అభ్యర్థులు కొంత నిరుత్సాహానికి గురైనా.. ఆ తర్వాత కౌన్సెలింగ్ నిర్వహణతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తొలుత ఉదయం 10 గంటల వరకు నూతన ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా నలుమూలల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులు పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఈలోగా కౌన్సెలింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగా, ఇదే విషయాన్ని అభ్యర్థులకు తెలిపారు. దీంతో వారంతా నిరుత్సాహంగా వెనుదిరిగారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో సాంకేతిక లోపాలు తలెత్తాయని, 317 జీవోతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను, స్పౌజ్ ఉపాధ్యాయులను వారి ప్రాంతాలకు చేర్చే ప్రక్రియ జరిగిన తర్వాతే కౌన్సెలింగ్ నిర్వహిస్తారని ప్రచారం జరిగింది. కానీ కాసేపటికే.. తిరిగి కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ రాష్ట్ర విద్యాశాఖ నుంచి మళ్లీ సమాచారం అందింది. దీంతో వెంటనే జిల్లా విద్యాధికారులు నూతన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లో మేసేజ్ పెట్టి, మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. దీంతో తిరిగి వెళ్లిన 413 మంది ఆనందఖని పాఠశాలకు చేరుకున్నారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ చేపట్టి అర్హత, ర్యాంకుల ఆధారంగా ఆయా పాఠశాలలకు కేటాయించారు. రాత్రి 9 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. కార్యక్రమంలో డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

23 ఏళ్ల నిరీక్షణ ఫలించింది



ఎంఏ హిందీ పండిట్ చేసి 23 ఏళ్లుగా ప్రయత్నిస్తూ ఈసారి జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించా. ఎట్టకేలకు ఎల్‌పీహెచ్(లాంగ్వేజ్ పండిట్ హిందీ) ఉద్యోగం వచ్చింది. ఇన్నాళ్లు వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేశా. ఇప్పుడు ప్రభుత్వ కొలువు సాధించి చర్ల మండలం తేగడ జెడ్పీహెచ్‌ఎస్‌లో నియామకం పొందాను. ఇన్నేళ్ల నిరీక్షణ ఫలించింది.

– తురుమెళ్ల కళ్యాణి, ఉపాధ్యాయురాలు

వాయిదా వేశామంటే కంగారు పడ్డాం



కౌన్సెలింగ్‌లో ఏ పాఠశాలకు కేటాయిస్తారో అనే ఆందోళన ఉంది. దానికి తోడు కౌన్సెలింగ్ వద్దకు చేరుకున్న కాసేపటికే వాయిదా పడినట్టు జిల్లా విద్యాధికారులు ప్రకటించారు. దీంతో చాలా కంగారు పడ్డాం, చివరి ప్రక్రియ వరకు వచ్చిన సమయంలో ఇలా జరిగింది అనుకునే లోగా మళ్లీ కౌన్సెలింగ్‌కు రావాలని సమాచారం అందించారు.

– బి.ఆశ, ఉపాధ్యాయురాలు

వెంటనే నిర్ణయం తీసుకోవడం హర్షణీయం



రాష్ట్ర విద్యాశాఖ అధికారులు కౌన్సెలింగ్‌ను వాయిదా వేసి, వెంటనే మళ్లీ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. విద్యా సంఘాల వారు, జిల్లా విద్యాధికారులు, తోటి ఉపాధ్యాయులు ఎవరికి అందిన సమాచారంతో వారు పలు విధాలుగా చర్చలు జరిపితే ఆందోళన చెందాను. కాని వెంటనే కౌన్సెలింగ్‌పై నిర్ణయం తీసుకోవడంతో ఆనందపడ్డాం.

– శిరిష, ఉపాధ్యాయురాలు

క్లుప్తంగా

సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు పరిశీలన



మిల్లు వద్ద బ్యానర్ ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీలక్ష్మీప్రియ కోటెక్స్ జిన్నింగ్ మిల్లులో ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యాన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఇల్లెందు మార్కెట్ కార్యదర్శి నరేశ్ ఆధ్వర్యాన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పింజ పొడవు రకం ఆధారంగా క్వింటా పత్తికి రూ.7,521 నుంచి రూ.7,121 వరకు ధర నిర్ణయించినట్లు తెలిపారు. సీసీఐ కేంద్రాలకు వచ్చే రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగులు మునీర్ తదితరులు పాల్గొన్నారు.

19, 20వ తేదీల్లో క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా జట్ల ఎంపికకు ఈ నెల 19, 20వ తేదీల్లో పోటీలు నిర్వహిస్తామని జిల్లా పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి కె.నర్సింహమూర్తి తెలిపారు. అండర్–14, 17 బాలబాలికల విభాగాల్లో షూటింగ్, స్క్వాష్, బాస్కెట్‌బాల్, స్కేటింగ్ జట్లతో పాటు అండర్–14 చెస్, అండర్–17 ఖో–ఖో జట్ల ఎంపిక ఉంటుందని వెల్లడించారు. అయితే, అండర్–17 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలకు ఇటీవల జిల్లాస్థాయికి ఎంపికైన వారు మాత్రమే రావాలని సూచించారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుతో సర్దార్ పటేల్ స్టేడియానికి రావాలని వివరించారు.

బీఆర్‌ఏఓయూలో ప్రవేశాల గడువు పొడిగింపు

ఇల్లెందురూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఇల్లెందు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ నాగేశ్వరరావు తెలిపారు. కొత్త అభ్యర్థులతోపాటు 2022–23, 23–24 విద్యాసంవత్సరం డిగ్రీలో చేరి ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న వారు ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. అంతకు ముందు చేరి ఫీజు చెల్లించకపోయిన వారు సైతం ఈ నెల 30వ తేదీ వరకు చెల్లించే వెసులుబాటు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

19న బీఆర్‌ఎస్ జిల్లాస్థాయి సమావేశం

మణుగూరురూరల్: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నెల 19న కొత్తగూడెం తెలంగాణభవన్‌లో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించనున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మంగళవారం తెలిపారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, తాటి వెంకటేశ్వర్లు, వనమా వెంకటేశ్వరరావు, దిండిగాల రాజేందర్, మానే రామకృష్ణ, బోదెబోయిన బుచ్చయ్య తదితరులు సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

కామేపల్లి: ఏజెన్సీ ప్రాంత రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ఇల్లెందు నియోజకవర్గంలోని పీఏసీఎస్ సొసైటీల చైర్మన్లు కోరారు. ఈసందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మంగళవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గతంలో రైతులకు మ్యానువల్ పహాణీ నకళ్లపై రుణాలు అందించారని, ఏజెన్సీలో గిరిజనేతరులకు పట్టా పాసు పుస్తకాలు మంజూరు కాకపోవడంతో రుణమాఫీ వర్తించక ఇబ్బంది పడతున్నారని తెలిపారు. ఈ మేరకు పోడు భూములు సాగుచేసుకుంటున్న సైతం రైతులకు సైతం రుణమాఫీ వర్తింపజేయాలని మంత్రిని కోరారు. కొండాయిగూడెం, కామేపల్లి, టేకులపల్లి, బయ్యారం పీఏసీఎస్‌ల చైర్మన్లు ధనియాకుల హన్మంతరావు, పుచ్చకాయల వీరభద్రం, లక్కినేని సురేందర్, మూల మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం

కల్లూరు: కల్లూరులోని పుల్లపుకుంటలో మంగళవారం గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ సమాచారం మేరకు కల్లూరు ఏసీపీ రఘు, సీఐ లింగయ్య, ఎస్‌ఐ షాకీర్ చేరుకుని పరిశీలించారు. సుమారు 20 రోజుల క్రితం మృతి చెందినట్లు తెలుస్తుండగా మృతదేహం పాడైపోయింది. పెనుబల్లి వైద్యులను పిలిపించి అక్కడే పోస్టుమార్టం చేయించిన అనంతరం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

‘మద్దతు’ పెంచాల్సిందే..!

పత్తి క్వింటాకు రూ.7,521 ధర ప్రకటించిన సీసీఐ

- గిట్టుబాటు కాదంటున్న రైతులు
- రూ.10 వేలు చెల్లించాలని వేడుకోలు
- జిల్లాలో 2,01,216 ఎకరాల్లో పత్తి సాగు



పత్తి లోడ్ చేస్తున్న హమాలీలు (ఫైల్)

సుజాతనగర్: ఏటా ఏదోవిధంగా నష్టాలను చవిచూసిన రైతులు ఈ ఏడాది గంపెడాశతో పత్తి పంటను సాగు చేశారు. ఆగస్టు మొదటి వారం వరకు ఎడతెరిపిలేకుండా వర్షాలు కురిసినా ఆ తర్వాత ఎండల తీవ్రత పెరిగింది. దీంతో పంటలకు ప్రతికూల వాతావరణం ఏర్పడింది. జూలైలో కురిసిన వర్షాలతో పత్తి మొక్కలు ఎర్రబారి ఎదుగుదల లేకుండా అయిపోయాయి. ఏటా చాలా ఎత్తు పెరిగే మొక్కలు ఈ సారి ఆశించినంత ఎత్తు ఎదగలేదు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల మూలంగా తెల్లదోమ, పచ్చదోమ ఉధృతి పెరిగింది. దోమల ఉధృతి కారణంగా మొక్కలకు నాటిన 50–60 రోజుల వ్యవధిలో తెగుళ్లు వ్యాపించడంతో పురుగుమందులు పిచికారి చేసి రైతులు పంటలను కాపాడుకున్నారు. దున్నడం, విత్తనాలు, ఎరువులు, కూలీలకు ఇతరత్రా ఖర్చులు కలుపుకుని ఇప్పటివరకు ఎకరానికి రూ.30 నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టారు. సాధారణంగా ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అయితే ఈసారి కూడా పంట చేతికొస్తున్న తరుణంలో తెగుళ్లు చుట్టుముట్టాయి. ప్రధానంగా పత్తి చేలు ఎర్రబారి పూత, పిందె రాలిపోతున్నాయి. దీంతో ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. అయితే బహిరంగ మార్కెట్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,521 కాకుండా రూ.10 వేలు లభిస్తేనే గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

1,60,973 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

పత్తి కొనుగోళ్లకు సీసీఐ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లాలో రైతులు 2,01,216 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. వాతావరణం అన్నివిధాలా అనుకూలించినట్లయితే 1,60,973 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకనుగుణంగా జిల్లాలోని దమ్మపేట, కొత్తగూడెం, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధిలోని సుజాతనగర్, కారేపల్లి, బూర్గంపాడు, అశ్వాపురం మండలాల్లోని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాకు రూ.7,521ల మద్దతు ధర దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాలు సైతం నిర్వహిస్తున్నారు.

పెరిగిన పెట్టుబడితో పోలిస్తే తక్కువే..

గతేడాది సీసీఐ మద్దతు ధర క్వింటాకు రూ.6,030 మాత్రమే ప్రకటించింది. బహిరంగ మార్కెట్లో వ్యాపారులు మద్దతు ధరకంటే ఎక్కువ రేటుకు కొనుగోలు చేయడంతో సీసీఐ నామమాత్రంగా కొనుగోలు చేసింది. గతేడాది వర్షా కాలంలో తీసిన మొదటిదశ పత్తిని క్వింటాకు రూ.7 వేలకు, రెండో దశ పత్తిని రూ.8 వేల నుంచి రూ.9,000 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. సీజన్ చివరి నాటికి రూ.10 వేల వరకు పలికింది. కొందరు రైతులు ధర ఇంకా పెరుగుతుందన్న ఆశతో ఇళ్లలో పత్తిని నిల్వ చేశారు. కానీ మార్కెట్లో ధర అమాంతం పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మద్దతు ధర కొంత ఆశాజనకమే అయినప్పటికీ ఈ యేడు పెరిగిన పెట్టుబడి ఖర్చుతో పోల్చితే అది తక్కువేనని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఏటా ఖర్చు పెరుగుతోంది..



పత్తి సాగుకు ఏటా పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. సరైన దిగుబడి, ధర లేక నష్టం వాటిల్లుతోంది. గతేడాది పంటచేతికి వచ్చే సమయానికి మార్కెట్లో ధర క్వింటాకు రూ.2 వేల వరకు పడిపోయింది. పెరుగుతుందని ఆశతో మూడు నాలుగు నెలలు నిల్వ చేశాం. విధిలేని పరిస్థితుల్లో చాలా తక్కువ ధరకు అమ్ముకున్నాం.

– ఎస్‌కే మౌలాలి, రైతు, సుజాతనగర్

రూ.10 వేల ధర నిర్ణయించాలి



జిల్లాలో వరి తరువాత రైతులు పత్తిని అధికంగా సాగు చేస్తుంటారు. పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ఖర్చుకు తగ్గట్టు మద్దతు ధర లభించడం లేదు. రైతులు నష్టాలను చవి చూస్తున్నారు. ప్రభుత్వం పత్తి మద్దతు ధరను రూ.10 వేలుగా నిర్ణయించాలి. దిగుమతులపై ఆంక్షలు విధించి ఎగుమతులను ప్రోత్సహించాలి.

– యలమంచి వంశీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు



చిరుత అడుగుజాడలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది

జూలూరుపాడు: పంట పొలాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు అన్నారు. జూలూరుపాడు, తల్లాడ అటవీ రేంజ్ సరిహద్దులోని మున్యాతండా, భద్రుతండా గ్రామాల సమీప పొలాల్లో చిరుత సంచరిస్తోందని రైతులు చెపుతుండగా మంగళవారం ఆయన అటవీ సిబ్బందితో కలిసి పంట పొలాల వద్ద పరిశీలించారు. చిరుత అడుగుజాడలను వెదికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొలాల్లో చిరుత పులి పాదముద్రల జాడలు కనిపించాయని, అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్లొద్దని సూచించారు. రాత్రి సమయాల్లో రైతులు ఒంటరిగా పొలాలకు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఆయా గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ మేరకు చాటింపు వేయించామని తెలిపారు. ఎవరికైనా చిరుత పులి కనిపిస్తే తక్షణమే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, దానికి ఎలాంటి హాని తలపెట్టొద్దని కోరారు. చిరుత సంచరించిన పొలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జూలూరుపాడు అటవీ సెక్షన్ అధికారి ఎం.హనుమంతు, బీట్ అధికారులు అనిత, కిషన్, రైతులు పాల్గొన్నారు.

ఒంటరిగా బయటకు రావొద్దు..

జూలూరుపాడు, ఏన్కూరు మండలాల సరిహద్దు అటవీ ప్రాంతం, మున్యాతండా గ్రామ సమీప పంట పొలాల్లో చిరుత పులి సంచరిస్తున్న నేపథ్యాన ప్రజలు ఒంటరిగా బయటకు రావొద్దని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి సూచించారు. చిరుత సంచారాన్ని అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారని తెలిపారు. ఈ మేరకు ప్రజలు రాత్రి వేళలో ఇళ్లలో నుంచి ఒంటరిగా రావొద్దని, భీమ్లాతండా, భద్రుతండా గ్రామాల ప్రజలు, అటవీ సరిహద్దు ప్రాంత రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సీఐ కోరారు. అలాగే, చిరుత పులి కనినిస్తే అటవీశాఖ అధికారులు కానీ పోలీసులకు కానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

వరిలో ఎండాకు తెగులు

సస్యరక్షణపై శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు



వరి పొలంలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి, చిన్ననల్లబల్లి, పెద్దనల్లబల్లి గ్రామాల్లో కొత్తగూడెం కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యాన శాస్త్రవేత్తలు, అధికారులు మంగళవారం పంటలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, శివ, ఏడీఏ సుధాకర్‌రావు తదితరులు పాల్గొనగా వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఉధృతిని గమనించారు. ఈ తెగులు ఆశిస్తే ఆకు చివర గోధుమ రంగు వర్ణంలో మచ్చలు ఏర్పడి క్రమేపి ఆకు ఎండిపోతుందని తెలిపారు. దీని నివారణ కోసం రైతులు నత్రజని ఎరువుల వాడకం నిలిపివేసి పొలంలో నిల్వ నీటిని తొలగించాలని, బ్యాక్టీరియా నివారణకు ప్లాంటామైసిన్ ఒక గ్రామును 10 లీటర్ల నీటిలో, కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. లేదంటే అగ్రిమైసిన్ 4 గ్రాములను 10 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. పిచికారీ సమయాన దుబ్బు కూడా బాగా తడిచేలా చూడాలని, గింజ గట్టి బడే దశలో ఉన్న వరి పొలాల్లో ఈ తెగులు గమనిస్తే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం పత్తి, మిర్చి, ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏఓ నవీన్‌కుమార్, ఏఈఓలు హసీనా, బాలాజీ, వినీల తదితరులు పాల్గొన్నారు.

వరి పంటపై కలుపుమందు పిచికారీ



ఎండిపోయిన పొలంలో రైతు

కారేపల్లి: చేతికి వచ్చిన వరి పంటపై గుర్తతెలియని వ్యక్తులు కలుపుమందు పిచికారీ చేయడంతో పంట పాడైందని రైతు వాపోయాడు. మండలంలోని గేటుకారేపల్లికి చెందిన సాయినేని బసవయ్య ఎకరం భూమిలో వరి సాగు చేశాడు. ఈ పంటపై గుర్తుతెలియని వ్యక్తులు కలుపు మందు పిచికారీ చేయగా ఎండిపోయింది. ఈమేరకు రూ.40వేల మేర నష్టం ఎదురైందని ఆయన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు.

కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



జీఎం షాలెంరాజుతో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్, నాయకులు

సత్తుపల్లిరూరల్/సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూనే ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యాన ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలోని మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. త్వరలోనే సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు ఐటీ మాఫీ, సొంతింటి పథకంపై ప్రభుత్వ పెద్దలతో చర్చిస్తామని తెలిపారు. అలాగే, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచడంపై దృష్టి సారిస్తామన్నారు. ఆ తర్వాత కొత్తగూడెం ఏరియా జీఎం జనరల్ మేనేజర్ శాలేంరాజుతో సమావేశమై వీకే–8 ఓసీ అనుమతులు, పీవీఎస్ కాలనీలో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు నరసింహారెడ్డి, త్యాగరాజన్, రజాక్, రామారావు, వికాస్ యాదవ్, ఆల్బర్ట్, నాగభూషణం, సీతారామరాజు, గౌస్, రాజేశ్వరరావు, సాగర్, లక్ష్మణ్‌రాజ్, గౌస్, రాజేశ్వరరావు, బోలే అరవింద్, కుమార్, ప్రసాద్, ఉమర్, పీతాంబరం, రావి నాగేశ్వరరావు, క్రాంతికుమార్, భట్టి విక్రమార్క, చెన్నకేశవరావు, ప్రకాష్, బాలాజీ పాల్గొన్నారు.

కేటీపీఎస్ కార్మికుడికి అస్వస్థత

ఆస్పత్రి వైద్యురాలితో సహచరుల వాగ్వాదం



ఉద్యోగులతో మాట్లాడుతున్న సీఈ ప్రభాకర్‌రావు, సూపరింటెండెంట్ సుహాసిని

పాల్వంచ: విధుల్లో ఉన్న కేటీపీఎస్ ఉద్యోగి అస్వస్థతకు గురికాగా ఆస్పత్రికి తీసుకొస్తే అక్కడ వైద్యురాలు, ఉద్యోగుల మధ్య వాగ్వాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పాల్వంచలోని కేటీపీఎస్ 5వ దశ కోల్ ప్లాంట్‌లో విధులు నిర్వర్తిస్తున్న జేపీఏ పద్మారావుకు మంగళవారం ఉదయం 4 గంటల సమయాన కడుపులో మంట రావడంతో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో సహచర సిబ్బంది ఆయనను కేటీపీఎస్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ క్రమాన తలుపు వేసి ఉండటంతో గట్టిగా కొట్టగా.. విధుల్లో ఉన్న వైద్యురాలు సింధుపల్లవి, సిబ్బంది తలుపులు తీశారు. అయితే తలుపులు వెంటనే తీయకపోవడంతో ఉద్యోగులు వైద్యురాలిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాక ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులకు సమాచారం ఇవ్వడంతో పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ విషయమై సమాచారం అందుకున్న చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ సుహాసిని చేరుకుని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ విషయమై సీఈని వివరణ కోరగా వైద్యురాలు వెంటనే తలుపు తీయకపోవడంతో గొడవ జరిగిందని తెలిపారు.

వివాహిత అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని కోనేరుబజారుకు చెందిన వివాహిత.. తన భర్తతో తరచూ గొడవలు జరుగుతున్న కారణంగా మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. విషయం తెలుసుకున్న వివాహిత సోదరుడు రమేశ్ తమ బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యయాతి రాజు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

పాల్వంచరూరల్: మండలంలోని రంగాపురం వద్ద కిన్నెరసాని వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని ఎస్‌ఐ సురేశ్ మంగళవారం పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ పార్దెవీటి చరణ్ సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పాల్వంచ: ఆర్‌టీసీ బస్సు ఢీకొట్టగా రోడ్డు దాటుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పట్టణంలోని బీసీఎంరోడ్‌లో ఇందిరానగర్‌కాలనీ వద్ద లక్ష్మీదేవిపల్లికి చెందిన వేమన నాగరాజు (50) రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి మణుగూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగరాజును ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ రాఘవయ్యను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని, మృతదేహాన్ని మార్చురీకి తరలించామని తెలిపారు.

కొనసాగుతున్న కోటమైసమ్మ జాతర



జాతర ప్రాంగణంలో భక్తుల కోలాహలం

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన శ్రీకోటమైసమ్మతల్లి ఆలయంలో జరుగుతున్న జాతర మంగళవారం నాలుగోరోజుకు చేరింది. దేవాదాయ ధర్మదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న దసరా పర్వదినం రోజున మొదలైంది. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, సూర్యాపేట తదితర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. కాగా, జాతర బుధవారం ముగియనుండగా, ఆతర్వాత హుండీ లెక్కింపు చేపడుతామని ఈఓ వేణుగోపాలాచార్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

- చర్ల మండలంలో ఇద్దరు విద్యార్థులు..
- పాల్వంచ మండలంలో ఇద్దరు జేసీబీ డ్రైవర్లు

రెండు వేర్వేరు చోట్ల మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. చర్ల మండంలో జరిగిన ఘటనలో ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా.. పాల్వంచ మండలంలో ఇద్దరు జేసీబీ డ్రైవర్లు విగతజీవులుగా మారారు.

● సుబ్బంపేట సమీపంలో...



మురళీకృష్ణ, రేవంత్‌రాజ్ (ఫైల్)

చర్ల: చర్లలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో చదువుతున్న వెంబటి మురళీకృష్ణ (16), చర్లకు చెందిన చింతలపూడి రేవంత్‌రాజ్ (15), లింగాపురంపాడుకు చెందిన షేక్ యాకూబ్ మంగళవారం ఉదయం స్కూల్‌కు వచ్చి మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై సుబ్బంపేట సమీపంలోని ఎదిరగుట్టల వద్దకు వెళ్లి తిరిగివస్తున్నారు. ముందు వెళ్తున్న బైక్‌ను ఓవర్‌టేక్ చేయబోగా ఎదురుగా వస్తున్న లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. వెంబటి మురళీకృష్ణ, చింతలపూడి రేవంత్‌రాజ్ లారీటైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. షేక్ యాకూబ్ గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. చర్ల సీఐ రాజువర్మ సిబ్బందితో ఘటనా ప్రాంతానికి చేరుకొని యాకూబ్‌ను ఆస్పత్రికి తరలించి, లారీడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

● డివైడర్‌ను ఢీకొని..



నరేశ్ (ఫైల్) రవి (ఫైల్)

పాల్వంచరూరల్: బూర్గంపాడు మండలం బుడ్డగూడెం గ్రామానికి చెందిన జేసీబీ డ్రైవర్లు సోడె నరేశ్ (28), సోడే రవి అలియాస్ సారయ్య (32) పాల్వంచకు వచ్చి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నారు. లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ కబరస్థాన్ వద్ద బీసీయం జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో నరేశ్ అక్కడికక్కడే మృతిచెందగా రవిని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ సురేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కలప పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామ శివారులో అక్రమంగా దాచి ఉంచిన కలపను రేంజర్ కమల ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి, కలపను స్వాధీనం చేసుకున్నామని, కలప విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని రేంజర్ వెల్లడించారు. ఎఫ్‌ఎస్‌ఓ నందా, ఎఫ్‌బీఓ జోత్స్న పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం 12.540కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు పట్టణంలో తనిఖీలు చేస్తుండగా ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద ద్విచక్రవాహనంపై తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై బ్లేడ్‌తో దాడి

సింగరేణి(కొత్తగూడెం): వ్యక్తిపై మరో వ్యక్తి బ్లేడ్‌తో దాడి చేసిన ఘటన మంగళవారం కొత్తగూడెం టూటౌన్ పరిధి రుద్రంపూర్‌లోని ఎస్‌బీహెచ్ వద్ద చోటుచేసుకుంది. చుంచుపల్లి మండలం 3 ఇంక్లయిన్‌కు చెందిన రెడ్డిరాజుల నరహరి లోన్ కోసం రుద్రంపూర్‌లోని బ్యాంకుకు వెళ్లగా.. రుద్రంపూర్‌తండాకు చెందిన కొంకటి సత్యనారాయణ నరహరిపై బ్లేడ్‌తో దాడి చేసి పారిపోయాడు. గాయపడిన బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు, బ్లూకోల్ట్స్ సిబ్బంది వివరాలు ఆరాతీస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసులు నమోదు

ఇల్లెందు: ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌లో రెండు వేర్వేరు ఘటనలకు సంబంధించి మంగళవారం పోలీసులు కేసులు నమోదు చేశారు. సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఈ నెల 10న రాత్రి కోరగుట్ట వెనుకగల ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించి కాపర్‌వైరును ఎత్తుకెల్లారు. ట్రాన్స్‌కో ఏఈ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గత నెల 28న ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ వద్ద ఓ స్కూటీని బొలేరో ఢీకొట్టింది. స్కూటీపై వెళ్తున్న వెంకన్న, ఆయన కుమార్తె వింధ్యకు గాయాలయ్యాయి. వెంకన్న ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ అబ్దుల్ ఘనీ కేసు నమోదు చేశారు.